ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 16.0
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 29 నవంబరు 2025





కన్నీరు మున్నీరౌతున్న అమూల్య కుటుంబ సభ్యులు

ఎన్నెన్నో కలలు కంటూ పుట్టింటి నుంచి మెట్టినింట అడుగుపెట్టిన అమూల్య.. ఐదేళ్ల తరువాత పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పగింతలనాడు భర్తతో కలిసి వెళ్లిన తమ బిడ్డను 'చల్లగా వెళ్లిరా తల్లీ..' అని చెమ్మగిల్లిన కళ్లతో దీవించిన తల్లిదండ్రులు, ఇప్పుడు గుండె పగిలేలా ఏడుస్తూ విగతజీవిగా మారిన తమ బిడ్డను తీసుకుపోయారు. అప్పుడు ఒంటరిగా మెట్టినింటికి వచ్చిన అమూల్య.. ఇప్పుడు తన ప్రాణప్రదమైన కొడుకును వెంట తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మెట్టినింటితో మాత్రమే బంధం తెంచుకుని వెళ్లుంటే.. బాగుండేదేమో..! కానీ లోకంతోనే బంధం తెచుకుని, కొడుకుతో కలిసివెళ్లి.. కన్నవారికి గుండెకోతను మిగిల్చింది.



కొడుకుతో అమూల్య (ఫైల్)

పదమ్మా పోదాం.. మన ఇంటికి..!

కొడుకుతో కలిసి పుట్టినింటికి.. అమూల్య

- పోస్టుమార్టం అనంతరం వెల్దుర్తికి మృతదేహాలు
- విషాదాన్ని మూటగట్టుకు వెళ్లిన తల్లిదండ్రులు
- డీటీ రవికుమార్, ఆయన తల్లిదండ్రులపై కేసు



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'అమూల్య' జీవితం అర్ధాంతరంగా ముగియడానికి భర్త వేధింపులే కారణమని అర్థమౌతోంది. 'పెళ్లి సమయంలో రూ.70 లక్షలకు పైగా కట్నం ఇచ్చాం. ఇల్లు కట్టుకునేందుకు ఇంకా డబ్బు కావాలని వేధించాడు. డబ్బులకే కాదు.. వేరే విషయాల్లోనూ వేధించాడు.' అని అమూల్య దగ్గరి బంధువు ఒకరు మీడియా ఎదుట కంటతడి పెట్టారు. అతన్ని కఠినంగా శిక్షించి, మాకు ఉపశమనం కలిగించాలి అని ప్రభుత్వానికి విన్నవించాడు. బాధిత కుటుంబ సభ్యులు పలువురు అమూల్య భర్త తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపుల కారణంగానే పసివాడిని చంపేసి అమూల్య తనతో తీసుకువెళ్లిందని కంటతడి పెట్టారు. ముద్దుల కొడుకుతో, భర్తతో ప్రశాంతంగా జీవించాల్సిన అమూల్య ఇలా బలవన్మరణానికి పాల్పడటం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. నగరంలోని జేఎన్టీయూ రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో రామగిరి డిప్యూటీ తహసీల్దారు రవికుమార్ కుటుంబం ఉంటోంది. ఆయన భార్య అమూల్య, కుమారుడు సహర్ష అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. భర్త వేధింపులను భరించలేక.. కన్నకొడుకును చంపేసి, అమూల్య ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

ముగ్గురిపై ఫిర్యాదు

తమ అల్లుడు రవికుమార్ వేధింపుల కారణంగానే తమ కూతురు అమూల్య, మనవడు సహర్ష ప్రాణాలను కోల్పోయారని ఆమె తల్లిదండ్రులు రామకృష్ణ, రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం కోసం రవికుమార్ తమ కూతురును వేధించారని, అల్లుడితోపాటు అతడి తల్లిదండ్రులు కుళ్లాయప్ప, శివాంజినమ్మ కూడా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో వరకట్నం ఇచ్చినా, అదనపు కట్నం కోసం వేధించారని పేర్కొన్నారు. తమ అల్లుడు, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని కోరారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటన జరిగిన రోజు అర్ధరాత్రి సెక్షన్ 304బి కింద కేసు నమోదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో అరెస్టు చూపించే అవకాశం ఉందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

మీతో బంధం చాలు..

తల్లీకొడుకుల మృతదేహాలకు సంఘటనా స్థలం నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గురువారం అర్ధరాత్రి తరలించారు. వైద్యులు, ఫోరెన్సిక్ అధికారులు, పోలీసుల సమక్షంలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ అధికారులు సమగ్ర వివరాలను సేకరించారు. పోస్టుమార్టం అనంతరం అమూల్య, ఆమె కుమారుడి మృతదేహాలకు తమకు అప్పగించాలని రవి, అతడి బంధువులు డిమాండ్ చేశారు. దీనికి అమూల్య తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. 'ఇక మీ బంధం చాలు అనుకునే తమ అమ్మాయి ఇలా చేసుకుంది. మేమే ఇద్దరి మృతదేహాలను తీసుకువెళతాం.' అని అన్నారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని, అమూల్య కుటుంబానికే ఎక్కువ నష్టం జరిగిందని, వారే మృతదేహాలను తీసుకువెళ్లడం సరైనదని అన్నారు. మృతదేహాలను శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అప్పగించారు. తమ స్వగ్రామం కర్నూలు జిల్లా వెల్దురికి ఇద్దరి మృతదేహాలను అమూల్య కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ఆనంద్



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద ఘన నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పూలే మహిళా విద్య కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఖుష్బూ కొఠారి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించేందుకే గ్రీవెన్స్

- ఎమ్మెల్యే అమిలినేని, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు



పరిష్కార వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కుందుర్పి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై వచ్చిన ప్రతి ఒక్కరి సమస్య తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని జంబుగుంపల గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం, గ్రీవెన్స్, రచ్చబండ, కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమాలకు నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ అధికారులు కూడా ప్రజలను ఇబ్బంది పెట్టకుండా వీలైనంత త్వరగా వారి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రెండు విడతల సాయం రైతుల ఖాతాల్లోకి జమ చేశామన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలో అశేష జనవాహిని సమక్షంలో జరిగిన భక్త కనకదాస విగ్రహావిష్కరణతో వైసీపీ నాయకులకు ప్రజల్లోకి వెళ్లేందుకు ఎలాంటి అవకాశం లేకుండా పోయిందన్నారు. అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ రైతన్నలకు కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందని, అరటి రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆక్రమంలోనే శుక్రవారం కలెక్టర్ అరటి రైతులు వ్యాపారులతో సమావేశం నిర్వహించి, పలు అంశాలు చర్చించారన్నారు.

స్వామి దిందక తోంతోం..!
అయ్యప్ప ఆలయంలో పునఃప్రతిష్ఠ వేడుకలు
(6లో....)



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రాణాలతో చెలగాటం



ఒకే బైక్‌పై వెళ్తున్న ఐదుగురు విద్యార్థులు

హ్యాండిల్ ఎక్కడో, గేర్ ఎక్కడో, బ్రేక్ ఎక్కడో.. ఏవీ సరిగా అందవు. ట్యాంకుపై కూర్చుని బైక్ నడపాల్సిందే. ఆపుదామంటే బ్రేక్ అందదు, స్లో చేద్దామంటే గేర్ అందదు, అదుపు చేసేందుకు హ్యాండిల్ కూడా అడ్డాదిడ్డంగా తిరుగుతుంది. ఇదీ బైక్ నడిపే విద్యార్థి పరిస్థితి. ఆ కుర్రాడిపై డ్రైవింగ్‌పై ఆధారపడి మరో నలుగురు అదే బైక్‌లో ప్రయాణం. అదుపు చేయలేని బైక్.. గాలిలో ప్రాణాలు. దీనిని సరదా అంటారా.. కానే కాదు.. ప్రాణాలతో చెలగాటమే. జరగరానిది జరిగితే భవిష్యత్ అంధకారమే కదా. కన్నవారి కలలు కల్లలే కదా.. ఒక్కసారి ఆలోచించండి.. వద్దు ఇలాంటి ప్రయాణం.. కొని తెచ్చుకోవద్దు.. ఘోర ప్రమాదం.. కళ్యాణదుర్గంలో శుక్రవారం ఒకే బైక్‌పై ఏకంగా ఐదుగురు విద్యార్థులు వెళ్తూ కనిపించారు. వారి ప్రయాణాన్ని చూసిన వారంతా.. జరగరానిది జరిగితే ఏంటని భయాందోళనలు చెందారు.

- కళ్యాణదుర్గం రూరల్, ఆంధ్రజ్యోతి

భూసమస్యలు సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ ఆనంద్

సమావేశమైన కలెక్టర్, జేసీ



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 544డికి సంబంధించి భూసమస్యలు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్-544డీకి సంబంధించిన భూసమస్యలపై జేసీ శివనారాయణ శర్మతో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... ఎన్‌హెచ్ 544డీకి సంబంధించి తాడిపత్రి అర్బన్, బుగ్గ, బోడిగానిదొడ్డి, ముచ్చుకోట, కొండాపురం, ఎర్రగుంటపల్లి తదితర గ్రామాల పరిధిలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ కేశవనాయుడు, జాతీయ రహదారుల అధికారి తరుణ్‌కుమార్, మేనేజర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఖాళీలు ఎవరి కోసం?

- డిజిటల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల్లో గోల్‌మాల్
- 144 ఖాళీలు ఉన్నా.. 120 మాత్రమే భర్తీకి చర్యలు
- డీపీఓ కార్యాలయంలో కౌన్సెలింగ్
- రోస్టర్ పాటించలేదని పలువురి ఆరోపణ
- కౌన్సెలింగ్ నిలిపేయాలని డిమాండ్



ఆప్షన్ ఫాంలు స్వీకరిస్తున్న డీపీఓలు నాగరాజనాయుడు, సమత

అనంతపురం న్యూటౌన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ (గ్రేడ్-6 కార్యదర్శుల) ఉద్యోగోన్నతుల్లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. 240కిపైగా గ్రేడ్-5 కార్యదర్శి ఖాళీలున్నాయి. వాటిలో ఉద్యోగోన్నతుల ద్వారా 144 భర్తీ చేయాల్సి ఉంది. జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయ వర్గాలు మాత్రం 120 ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టారు. మిగతా 24 ఎందుకు భర్తీ చేయట్లేదు, ఎవరికోసం దాచారని అర్హులు ప్రశ్నిస్తున్నారు. ఈ గోల్‌మాల్‌పై అర్హులు పోరాటానికి సిద్ధమయ్యారు. ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ఆపేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీలు 144.. భర్తీ చేసేది 120..

గ్రేడ్-6 కార్యదర్శులకు గ్రేడ్-5గా ప్రమోషన్ కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కొన్ని ఖాళీలున్నాయి. ఈ మధ్య కాలంలోనే గ్రేడ్-5 కార్యదర్శుల నుంచి గ్రేడ్-4కి ఉద్యోగోన్నతి కల్పించడంతో ఖాళీ అయిన వాటిని కలిపి గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లలో అర్హులైన వారితో ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారు. గ్రేడ్-5 కార్యదర్శులకు సంబంధించి క్యాడర్ స్ట్రెంత్ 567 ఉంది. వీరిలో వివిధ కారణాలతో 90 మంది వరకు అన్‌విల్లింగ్ ఇచ్చి వెళ్లిపోయారు. ఈ మధ్యకాలంలో గ్రేడ్-5 నుంచి గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులకు సంబంధించి 155 మంది జాబితా తయారు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇచ్చారు. జాబితాలో ఉన్నవారిలో ఐదుగురు ఉద్యోగోన్నతికి విముఖత చూపడంతో 150 మందికి మాత్రమే అవకాశం కల్పించారు. ఈ లెక్కన గ్రేడ్-5 క్యాదర్శులకు సంబంధించి 240కిపైగానే ఖాళీలు ఉన్నాయి. ఇందులో 60 శాతం ఉద్యోగోన్నతుల ద్వారా, మరో 40 శాతం నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఆ లెక్కన ఉద్యోగోన్నతి ద్వారా 144 ఖాళీలు భర్తీ చేయవచ్చు. అధికారులు మాత్రం 120 మందికి మాత్రమే ఉద్యోగోన్నతి కల్పించడానికి చర్యలు చేపట్టారు. అధికారుల తీరుపై అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్-5 ఉద్యోగోన్నతులు సక్రమంగా కల్పించి, గ్రేడ్-6 ప్రమోషన్ల విషయంలో ఎందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. జాబితా తయారీ బాధ్యతలను అర్హతలేని గ్రేడ్-4 కార్యదర్శికి అప్పగించడమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీపీఓ కార్యాలయంలో ఇయన వివాదాలకు కేంద్ర బిందువుగా మారారన్న ప్రచారం జరుగుతోంది. సాధారణ బదిలీల్లోనూ ఆయన అదే తరహాలో వ్యవహరించడంతో ఆఖరుకు డీపీఓ చీవాట్లు తినాల్సి వచ్చింది. గ్రేడ్-6 కార్యదర్శుల ప్రమోషన్లలోనూ ఇదే పరిస్థితి తలెత్త వచ్చన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఇయనకు తోడుగా గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులను కేటాయించారు. ముగ్గురూ కలిసి డీపీఓనే తప్పుదోవ పట్టిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. సచివాలయాల్లో ఉండాల్సిన గ్రేడ్-6, గ్రేడ్-5 కార్యదర్శులు డీపీఓ కార్యాలయంలో ఎందుకున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డెప్యుటేషన్‌పై అయితే.. ఎన్ని రోజులు ఇక్కడే ఉంటారన్న దానిపై స్పష్టతలేదు.

కలెక్టర్ దృష్టికి సమస్య

ఖాళీలను తక్కువగా చూపడాన్ని ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్న గ్రేడ్-6 కార్యదర్శులు నిరసిస్తున్నారు. దీనిపై పోరాటానికి దిగారు. సమస్యపై కలెక్టర్ ఆనంద్‌ను ఈనెల 26న కలిసి, వివరించారు. అన్ని ఖాళీలు భర్తీ చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలించి, న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు అర్హులు తెలిపారు.

ఎట్టకేలకు కౌన్సెలింగ్

వివాదాల నడుమ ఉమ్మడి జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-6 కార్యదర్శుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం అనంతపురంలోని డీపీఓ కార్యాలయంలో చేపట్టారు. ప్లేస్‌మెంట్ల కేటాయింపునకు సంబంధించి 120 మంది నుంచి అనంత, శ్రీసత్యసాయి డీపీఓలు నాగరాజనాయుడు, సమత.. ఆప్షన్ ఫాంలు స్వీకరించారు. వారికి రెండురోజుల్లో ప్లేస్‌మెంట్స్ కేటాయించనున్నట్లు డీపీఓలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు నాగరాజు, వంశీ పాల్గొన్నారు.

నిలిపేయాలి

గ్రేడ్-6 కార్యదర్శుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌ను వెంటనే నిలిపేయాలని పలువురు డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌన్సెలింగ్ హాల్‌లో డీపీఓలు నాగరాజనాయుడు, సమతను కలిసి విన్నవించారు. రోస్టర్ సరిగా పాటించకపోవడం ద్వారా రిజర్వేషన్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం వాటిల్లుతోందన్నారు. తప్పులకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగోన్నతుల్లో రోస్టర్ ప్రకారం ఎస్సీ-2 కేటగిరీకి 6.5 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో విస్మరించారన్నారు. ఒకరికి కూడా చోటు కల్పించకపోవడం సరికాదన్నారు. తప్పును సరిదిద్దిన తర్వాతే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీపీఓతో మాట్లాడుతుండగానే సంబంధిత గుమాస్తా నితీష్‌కుమార్ కలుగజేసుకుని, వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆయన మాటతీరు సరిగా లేకపోవడంతో జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమాస్తా కారణంగానే సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అక్రమాలకు పాల్పడుతూ.. అర్హులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గుమాస్తా నితీష్ కుమార్‌పై విచారణ చేసి, తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికే చేసేశారు!
- ఇంటి దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో ఎర్రర్
- అభ్యర్థులకు తెలియకుండానే దరఖాస్తులు
- నేటికీ ఇళ్లు, స్థలాలురాక ఇబ్బందులు
- హౌసింగ్ సర్వేలో గత ప్రభుత్వ నిర్వాకాలు వెలుగులోకి..
- ఆందోళనలో నూతన దరఖాస్తుదారులు
(వివరాలు 7లో,...)

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు: కలెక్టర్ 6

దివ్యాంగులకు భరోసా
వందశాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు
ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..
ఈనెల 30 వరకు గడువు
(వివరాలు 7వ పేజీలో...)

ది(తె)గులు
- దిగుబడి సమయంలో వరికి తెగుళ్ల ఉధృతి
- వ్యాపించిన దోమ పోటు, ఆకుమచ్చ, అగ్గితెగులు
- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన (6లో)

రూ.10 వేల లంచానికి ఏడేళ్ల జైలు
కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పు
(7లో)

సమన్వయంతోనే సక్సెస్: డీఆర్ఎం
(7లో)

శీతా.. చంపేయకే..!

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం



ఆకాశానికి.. అవనికి ఒకటే వణుకు..!
కంబళిని చుట్టుకున్నా నిద్ర లేదు..!
సూరీడి కోసం చీకటి కన్నుల ఎదురుచూపు..!



ఎంత కాచుకున్నా వేడి లేదు..
నిజమే.. ఇది 'చలి' మంట..!



అనంతపురం నగరంలో చలి తీవ్రత పెరుగుతోంది. సూరీడి కిరణాలు భూమిని తాకేందుకు తంటాలు పడేలా పొగ మంచు కమ్మేస్తోంది. సాయంత్రం మొదలైన వణుకు.. రేయి దాటుకుని.. ఉదయం 8 గంటలు దాటినా తగ్గడం లేదు. చలి మంటలు, దుప్పట్లు కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి.

దేవుడు.. జీవుడు..
పూజకు పూలు
పూటకు తిండి..!

రాత్రంతా
కునుకు లేదు..!
తెల్లవారినా
వణుకు తగ్గలేదు..!





పొద్దెక్కేదాకా
లేచే కథే లేదు..!



నేను రానేరానన్నా..
అమ్మ వింటే కదా..!

జెండర్ క్యాంపెయిన్ పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్

- కలెక్టర్ ఆనంద్



జెండర్ క్యాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జెండర్ క్యాంపెయిన్‌ను పక్కాగా నిర్వహించాలని డీఆర్‌డీఏ, అనుబంధ శాఖల అధికారులు, మహిళాసంఘాల సభ్యులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఏపీడీ రాధారాణిలతో కలిసి జెండర్ క్యాంపెయిన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జెండర్ క్యాంపెయిన్‌లో భాగంగా డిసెంబరు 23 దాకా స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యల సభ్యులు ప్రత్యేక ర్యాలీలు, సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మహిళాచట్టాలు, బాలిక విద్య, మహిళలు - పురుషులు సమానత్వం, బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం రవీంద్రబాబు, ఏపీఎంలు భాస్కర్‌నాయుడు, శివప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుశీలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు వరం

- ఆవిష్కరణల వైపు విద్యార్థులను ప్రోత్సహించండి
- సైన్స్ టీచర్లకు డీఈఓ, ఏపీసీ సూచన



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ, ఏపీసీ

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ప్రభుత్వ పాఠశాలలకు రావడం వరమని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణపై సైన్స్‌టీచర్లకు జిల్లా సైన్స్ సెంటర్‌లో మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. చివరిరోజు శుక్రవారం టీచర్లు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలోని 45 పీఎంశ్రీ స్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారన్నారు. ఇందుకోసం లక్షలు వెచ్చించి ల్యాబ్ భవనం, సైన్స్ పరికరాలు అందిస్తున్నారన్నారు. అలాంటి ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత హెచ్ఎం, టీచర్లపై ఉందన్నారు. ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచుతూ పరిశోధనల వైపు ఆలోచించేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ ఆఫీసర్ బాలమురళి, సీఎంఓ చంద్రశేఖర్, ఏపీఓ మంజునాథ్ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 64వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ(డిస్ట్రిక్ ఇండస్ట్రీస్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ఆయా శాఖల అధికారులు ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్

అరటి ధర తగ్గకుండా చూడాలి

జిల్లాలోని అరటి వ్యాపారులు, ఎగుమతి దారులు, ఉద్యానశాఖ అధికారులతో ధర నియంత్రణపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... అరటి కిలోకు రూ.6లకు తగ్గకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలని, ఎగుమతి దారులు ఇతర దేశాల మార్కెట్‌కు కిలో రూ.8లకు తగ్గకుండా కొనుగోలు చేసి ఎగుమతి చేయాలని సూచించారు.

5న మెగా పీటీఎం

జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 5న మెగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్‌మీటింగ్) 3.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంస్థల్లో మోడల్ స్కూళ్లలో, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ సంస్థల్లో పీటీఎం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. మొత్తం 1752 పాఠశాలలు, కళాశాలల్లో పీటీఎం నిర్వహిస్తుండగా, మొత్తం 2,15,504 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువు

జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగించినట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి 2026 జనవరి 31 వరకు లేదా నూతన అక్రెడిటేషన్‌లు జారీ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఏది ముందు జరిగితే అప్పటిరకు పొడిగింపు ఉంటుందని ఉత్తర్వులు జారీ చేసినట్లు పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు.

ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా ఉండాలి

అనంతపురం వైద్యం: అంగన్‌వాడీ కేంద్రాలద్వారా పౌష్టికాహారాన్ని తీసుకునే ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఐసీడీఎస్ అధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఎంవీపై ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పంపిణీ చేయాలన్నారు. 37 అంగన్‌వాడీ కార్యకర్తలు, 81 సహాయకుల పోస్టులతో పాటు ఇతర విభాగాల్లోని పోస్టులను భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వందశాతం ఆభా రిజిస్ట్రేషన్ జరగాలి

ఆభా(ఆయుష్మాన్ భారత్) రిజిస్ట్రేషన్ వందశాతం జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్య, ఆరోగ్యశాఖపై శుక్రవారం సమీక్షించిన కలెక్టర్ గర్భవతులు, ప్రసవాలు, సిజేరియన్, జననాలు, రక్తహీనత వంటి అంశాలపై అధికారులతో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులందరికీ జననీ సురక్ష యోజన ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉత్తమ మహిళా టీచర్ ఆచార్య శేష మహేశ్వరమ్మ



శేష మహేశ్వరమ్మ

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): 'ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ - షయోస్టా అక్తర్ మెమోరియల్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజనీరింగ్ కాలేజెస్' ఉత్తమ మహిళా టీచర్-2025కు జేఎన్‌టీయూఏ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య శేషమహేశ్వరమ్మ ఎంపికయ్యారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 55వ జాతీయ వార్షిక అధ్యాపక సదస్సును పురస్కరించుకుని అవార్డులను ప్రదానం చేస్తున్నారు. పుదుచ్చేరిలోని శ్రీ మనకుల వినాయకర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగున్న సదస్సులో అవార్డును అందజేస్తారు. తనకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందని ఆచార్య శేష మహేశ్వరమ్మ అన్నారు. వృత్తి ప్రయాణంలో గొప్ప గౌరవం దక్కిందని అన్నారు. తనకు ఎప్పటికప్పుడు అండగా నిలచిన విశ్వవిద్యాలయ పరిపాలకులు, గురువులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. అందరి సహకారం, ప్రోత్సాహంతో అవార్డు దక్కిందని అన్నారు. ఆమెను వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టు వీసీ ఆచార్య దేవన్న అభినందించారు.

గురువులకు ఆటల పోటీలు

అనంతపురం విద్య, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టీచర్లకు ఆటల పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పురుషులకు క్రికెట్, మహిళకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు క్రీడాపోటీల షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటించారు. ఈనెల 29, 30న మండలస్థాయిలో పోటీలు జరగనున్నాయి. డిసెంబరు 13, 14న డివిజన్ స్థాయిలోను, డిసెంబరు 20 నుంచి 22 వరకు జిల్లా స్థాయిలో, వచ్చే ఏడాది జనవరి 2నుంచి 4వరకు రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు.

టమోటా కిలో రూ.37



అనంతపురంరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2025 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

స్వామి దిందక తోంతోం..!

ఘనంగా అయ్యప్ప విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు



పూజలు అందుకున్న అయ్యప్పస్వామి, గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



అనంతపురం నగరంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పునఃప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భాస్కర తారానాథశర్మ నేతృత్వంలో ఆలయ ఆవరణలో అర్చక బృందం కలశార్చనలు, సాయందీక్షా హోమం, వేదపారాయణ జపాలు నిర్వహించారు. పునఃప్రతిష్ఠించనున్న విగ్రహాలతోపాటు స్వర్ణకవచ సహిత అయ్యప్పస్వామి విగ్రహాలకు ధాన్యాధివాసం, సుగంధ ద్రవ్యాధివాసం చేశారు. ఆలయ శిఖర కలశానికి వేద పండితులు, ఆలయ పాలక మండలి సభ్యులు అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి ఉత్సవమూర్తిని నగర వీధుల్లో గుండా ఊరేగించారు. వందలాది మంది అయ్యప్ప మాలధారులు స్వామివారి శరణుఘోషతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు హరినాథ రెడ్డి, ఉపాధ్యక్షులు నెట్టెం సూర్యనారాయణ, కేవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్‌ఐసీ సూర్యనారాయణ, కార్యదర్శి సివిల్ సప్లయ్స్ శ్రీనివాసులు, వెంకటనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

ది(తె)గులు

- దిగుబడి సమయంలో వరికి తెగుళ్ల ఉధృతి
- ప్రబలిన దోమపోటు, ఆకుమచ్చ, అగ్గితెగులు
- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన





తెగుళ్ల బారిన పడిన వరి

ధర్మవరం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన వరికి దోమపోటు, ఆకుమచ్చ, అగ్గితెగుళ్ల పట్టుకున్నాయి. వాతావరణ మార్పులతో తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంది. మండలవ్యాప్తంగా ఖరీఫ్‌లో 2వేలఎకరాల్లో బోరుబావులు, చెరువుల కింద వరి సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం పెరిగింది. పంట సాగుచేసి నాలుగు నెలలు కావస్తోంది. ప్రస్తుతం పంటకు విపరీతంగా తెగుళ్లు వ్యాపించాయి. తెగుళ్ల నివారణ కోసం రైతులు పురుగు మందుల దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. గింజలు ఏర్పడే దశలో ఈ తెగుళ్లు వ్యాపించడంతో దిగుబడి బాగా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నూరుబత్తలపల్లి, మల్కాపురం, చింతలపల్లి, పోతుకుంట, చిగిచెర్ల, వసంతపురం, కుణుతూరు, బడన్నపల్లి, తుమ్మల, తిప్పేపల్లి తదితర గ్రామాల రైతులు అధికంగా వరి సాగు చేశారు. దిగుబడి సమయంలో తెగుళ్లు ఉధృతి ఎక్కువగా ఉండటంతో వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్ల ఉధృతి తగ్గకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు తగన సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

దోమపోటుకు మందులు పిచికారీ చేశా



వరి పంటలో అధికంగా దోమపోటు, అగ్గితెగులు సోకింది. దిగుబడి సమయంలో తెగుళ్లు వ్యాపించడంతో ఆందోళనగా ఉంది. నివారణకు మందులు పిచికారీ చేశా. వాతావరణంలో మార్పులతో తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంది. గింజలు ఏర్పడే సమయంలో తెగుళ్లు రావడంతో ఆ గింజలు తాలుగా మారే అవకాశం ఉంది.

- భాస్కర్ చౌదరి, సాగురైతు, చిన్నూరు, బత్తలపల్లి, ధర్మవరం మండలం

మందులు పిచికారీ చేసుకోవాలి



వాతావరణ మార్పులతో ప్రస్తుతం వరికి దోమపోటు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో మందులు పిచికారీ చేసుకోవాలి. వరిలో దోమపోటు నివారణకు పైమెట్రజోల్ 50శాతం అనే ద్రావణాన్ని ఎకరాకు 120గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అగ్గితెగుళ్ల నివారణ ట్రైసైక్లోజోల్, ఆకుమచ్చ తెగుళ్లకు సాఫ్ కార్బన్డజిమ్12 శాతం, మ్యాన్కోజెబ్ 63శాతాన్ని ఎకరాకు 400గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి. తెగుళ్లను సకాలంలో నివారిస్తే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంటుంది.

- ముస్తఫా, ఏఓ, ధర్మవరం

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దండి

- ఏటీఎల్ ఇన్‌చార్జ్‌లకు డీఈఓ సూచన

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నూతన అవిష్కరణలు చేసి, తద్వారా విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని డీఈఓ క్రిష్టప్ప పేర్కొన్నారు. మూడు రోజులుగా స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) ఇన్‌చార్జ్ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ బోధనల ద్వారా విద్యార్థుల్లో జిజ్ఞాసను రేకెత్తించి, వారు ఆవిష్కరణల వైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీతిఅయోగ్, అటల్ ఇన్నొవేషన్ మిషన్, సమగ్రశిక్ష, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులను నిర్వహించినట్లు జిల్లా సైన్స్‌అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లాలో 12 పాఠశాలకు చెందిన ఏటీఎల్ ఇన్‌చార్జ్‌లు 8 ప్రదర్శనలు రూపొందించారన్నారు. ఈ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో ఉపయోగపడే రీతిలో ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో ఏడీ-2 లాజర్, బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎంగోపాల్, ఎంఈఓ-2 జయచంద్ర, రమేశ్, అనిల్ పాల్గొన్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ

సమన్వయంతోనే సక్సెస్: డీఆర్ఎం



మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేసి రైల్వేలో భద్రత, సమయ పాలన లక్ష్యాలను సాధించాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ కేంద్రంలోని మల్టీ డిసిప్లినరీ డివిజనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల భాగస్వామ్యంలో భద్రతా సదస్సును శుక్రవారం ఉదయం నిర్వహించారు. సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ స్టేషన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో సమయానుగుణంగా తనిఖీలను నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో షార్ట్‌కట్స్‌ను అనుసరించరాదని సూచించారు. కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. విధి నిర్వహణలో చొరవచూపిన అధికారులను ప్రశంసించారు.

రైలు దారి మళ్లింపు

గుంతకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తర మధ్య రైల్వేలోని వీరాంగన లక్ష్మీబాయి రైల్వే స్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫాంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే ఓ రైలును దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ సరాయ్ రోహిల్లా-యశ్వంతపూర్ వీక్లీ దురంతో (12214) ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 1వ నుంచి జనవరి 5 వరకూ దారి మళ్లించి నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలును పేర్కొన్న తేదీల మధ్య మధుర, బయాన, సోగరియా, రుథియాయి, బీనా స్టేషన్ల మీదుగా దారి మళ్లించనున్నట్లు వివరించారు.


రైల్వే ఉద్యోగి భార్య ఆత్మహత్య

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్ రైల్వే ఇనిస్టిట్యూట్ సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్న రైల్వే ఉద్యోగి భార్య జ్యోతి(23) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ కుమార్ స్థానిక రైల్వేలో లోకో పైలెట్‌గా పని చేస్తున్నాడు. ఆయన డ్యూటీకి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో జ్యోతి ఈ అఘాయిత్యానికి పాల్పడిందన్నారు. వీరికి వివాహమై మూడేళ్లయినా సంతానం కలగలేదని బాధ ఉండేదని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటిలో ఈదలేక గేదె మృతి

రైల్వే అండర్ బ్రిడ్జిలో 15 అడుగుల మేర నీటి నిల్వ

పొలాలకు వెళ్లేందుకు తుమ్మల గ్రామ రైతుల ఇబ్బందులు



గేదె కళేబరం

ధర్మవరంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో ఈదలేక ఓ గేదె మృత్యువాత పడిన సంఘటన మండలంలోని తుమ్మల గ్రామసమీపంలో జరిగింది. ఇక్కడ 15అడుగుల మేర నీళ్లు నిలబడటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తుమ్మల గ్రామ రైతులకు బ్రిడ్జి అవతల సుమారు 100ఎకరాల పొలాలు ఉన్నాయి. ప్రతిరోజు అండర్‌బ్రిడ్జిని దాటుకోని వెళ్లాల్సి ఉంటుంది. సాధారణంగా రైతులు ఆవులు, గేదెలను నీళ్లలోకి వదిలి వారు మాత్రం రైల్వేట్రాక్‌పై దాటుకుని వెళ్తారు. కొన్ని సందర్భాల్లో ఆ నీళ్లలో పశువులు రాలేక మృత్యువాత పడుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతు బాలిరెడ్డి తన గేదెలను తోలుకోని పొలానికి బయల్దేరాడు. రోజులాగే అండర్‌బ్రిడ్జి నీళ్లలో గేదెలు ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరడం ప్రారంభించాయి. అయితే ఓ గేదె ఈదలేక నీళ్లలోనే మృతిచెందింది. పాడి గేదె మృతిచెందడంతో రూ.1లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదివరకే ఈ నీళ్లల్లో కాడెద్దులు, ఆవులు మృతిచెందాయని గ్రామస్థులు తెలిపారు. రైల్వేఅండర్‌బ్రిడ్జిలో నీటిని మోటర్ల ద్వారా బయటకు తోడేయాలని లేదా సమీపంలో చిత్రావతి నదిలోకి వెళ్లేలా కాలువ చేయాలని రైల్వేఅధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

గుత్తిలో అదృశ్యం.. వైటీ చెరువులో మృతదేహం



విజయలక్ష్మి (ఫైల్)

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విజయలక్ష్మి(54) గుంతకల్లు మండలం వైటీ చెరువులో మృతదేహమై తేలింది. రామాంజనేయులు రెడ్డి భార్య విజయలక్ష్మి రెండు రోజుల క్రితం గుత్తిఆర్ఎస్‌లోని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామారావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఆమె వెళ్లిన పొలం ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ రక్తపు మరకలు, మద్యం బాటిళ్లు కనిపించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనంతపురం నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారం దొరకలేదు. ఈ నేపథ్యంలో గుంతకల్లు మండలం వైటీ చెరువులో విజయలక్ష్మి మృతదేహం శుక్రవారం తేలింది. ఆమె ముఖం పూర్తిగా ఉబ్బిపోయి ఉంది. కుటుంబీకుల సహకారంతో ఆమె విజయలక్ష్మిగా గుర్తించారు. ఈమెది ఆత్మహత్యా, హత్యా.. అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును గుత్తి పోలీసులు దర్యాప్తు చేస్తారా.. గుంతకల్లు రూరల్ స్టేషన్ సిబ్బందా.. అన్నది తేలాల్సి ఉంది.

దివ్యాంగులకు భరోసా

వందశాతం రాయితీతో త్రిచక్ర వాహనాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు... ఈనెల 30 వరకు గడువు

శింగనమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తీపికబురు చెప్పింది. త్రిచక్ర వాహనాలను వందశాతం సబ్సిడీతో ఇవ్వనుంది. అందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. దరఖాస్తు గడువును ఈనెల 30 వరకు పొడిగించింది. పదో తరగతి ఉత్తీర్ణులై, స్వయం ఉపాధి పొందుతున్న, ప్రైవేటు ఉద్యోగం చస్తున్న విభిన్న ప్రతిభావంతులు అర్హులు. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు కూడా వీటిని పొందవచ్చు. addacacgov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

అర్హతలు

- ఒకటి లేదా రెండు కాళ్లు ప్రభావితమైన 70 శాతం వైకల్యం ఉన్నవారు
- రెండు చేతులు సక్రమంగా ఉండాలి
- 18నుంచి 45 ఏళ్లవు వయసు ఉండాలి
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు మునుపు వాహనాలు తీసుకోకూడదు
- డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి
- వార్షిక ఆదాయం రూ.3 లక్షలులోపు ఉండాలి
- తెల్లరేషన్ కార్డు తప్పనిసరి
- ఆధార్, రేషన్‌కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, వైకల్యానికి సంబంధించిన సదరం సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుతం అందుతున్న పింఛన్ పుస్తకం సమర్పించాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, అంగవైకల్యం చూపే విధంగా ఉన్న ఫొటోలను జత చేస్తూ సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇప్పటికే చేసేశారు..!

ఇంటి దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో ఎర్రర్

అభ్యర్థులకు తెలియకుండానే దరఖాస్తులు

నేటికీ ఇళ్లు, స్థలాలు రాక ఇబ్బందులు

హౌసింగ్ సర్వేలో గత ప్రభుత్వ నిర్వాకాలు వెలుగులోకి..

ఆందోళనలో నూతన దరఖాస్తుదారులు



సచివాలయంలో సర్వే దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

అనంతపురం వైద్యం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హెచ్చరిక..! ఇప్పటికే మీరు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మీ ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవడం కుదరదని ఆన్‌లైన్‌లో మేసేజ్ వస్తుండటంతో దరఖాస్తుదారులు అవాక్కవుతున్నారు. ఇప్పటి వరకు మేము దరఖాస్తు చేసుకోనేలేదు. గత ప్రభుత్వంలో వలంటీర్లు ఆధార్ కార్డులు అడిగితే ఇచ్చాం అంతే అని చెబుతున్నారు. అయినా ఇల్లు రాలేదు, స్థలం ఇవ్వలేదు. ఇదెక్కడి అన్యాయమని వారు వాపోతున్నారు. అందరికి సొంత ఇళ్ల నినాదంతో కూటమి ప్రభుత్వం ఈనెల 10నుంచి హౌసింగ్ సర్వే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గృహనిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజనీర్(డీఈ), అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)లు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల వారిగా ప్రతి కుటుంబం వద్దకెళ్లి మీకు స్థలం ఉందా? సొంత ఇల్లు ఉందా? అని వివరాలు సేకరిస్తున్నారు. ఇల్లు, స్థలం లేనివారికి కొత్తగా మంజూరు చేసేలా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే దరఖాస్తుదారుల ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్ యాప్, పోర్టల్లో ఎంటర్ చేయగానే హెచ్చరిక..! అంటూ ఇదివరకే దరఖాస్తు చేసినట్లు మేసేజ్ వస్తోంది. దీంతో ఇల్లు, స్థలం మంజూరు అవుతుందా? లేదా? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే స్థలం, ఇల్లు

లక్షల మందికి జగనన్న ఇంటి స్థలాలు కేటాయించి సొంత ఇళ్లను నిర్మించామని గత వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. అయితే ఇదంతా కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఉందని బాధిత వర్గాలు మండిపడుతున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో నేటికీ అద్దె ఇళ్లు, గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. ఊరందరికీ ఇస్తే జగనన్న స్థలాలు, ఇళ్లు ఏమైయ్యాయని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలోని దరఖాస్తులను డిలిట్ చేసి, ప్రస్తుత సర్వేలో అప్లికేషన్ తీసుకోవాలని, ఆమేరకు స్థలం, ఇల్లు మంజూరు చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

మీరింకా అప్‌డేట్ కాలేదు

ప్రస్తుత హౌసింగ్ సర్వేలో అనేకమంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకోవడంలేదు. మీ ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ కాలేదని, ఫింగర్ ప్రింట్, ఐరిష్ అప్‌డేట్ కాలేదని ఎర్రర్ చూపిస్తోంది. అదేవిధంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందలేదని ఎర్రర్ వస్తోంది. ఇలా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దరఖాస్తులు ఇలాంటి ఎర్రర్‌లు వస్తున్నట్లు సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది చెబుతున్నారు. సొంత స్థలం, ఇల్లు లేక చాలా జంటలు వారి తల్లిదండ్రుల ఇళ్లలోనే కాపురముంటున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైనా దరఖాస్తు చేయలేని పరిస్థితి. అప్‌డేట్ చేసుకోవడానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగిస్తే అర్హులకు న్యాయం చేయవచ్చునని సర్వే వర్గాలు వివరిస్తున్నాయి.

ఒక్కరోజే 8వేలు..

సర్వే ప్రారంభమైన 10 తేదీ నుంచి 18రోజుల్లో 33వేల కుటుంబాలను సర్వేచేశారు. శుక్రవారం ఒక్కరోజులోనే 8వేల కుటుంబాలను సర్వేచేసినట్లు గృహనిర్మాణ సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అన్ని గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేశామని ప్రభుత్వానికి నివేదిక పంపడానికి ఇలా చెబుతున్నారా? లేక గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలనే మార్గదర్శకంగా తీసుకున్నారా? అనే అనుమానాలు ఉత్పన్నమౌతున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఎదురౌతున్న సమస్యలకు అధికారులు చెబుతున్న వివరాలకు పొంతనలేదని గణాంకాల పరిశీలక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. శని, ఆదివారం వరకు సర్వేగడువు ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావని పేర్కొంటున్నాయి.

దంపతుల్లో ఒకరు..

నూతన ఇల్లు, స్థల దరఖాస్తులకు కుటుంబంలోని భార్య, భర్త ఇద్దరూ అర్హులే. భార్య ఆధార్ నంబర్‌కు ఎర్రర్ వచ్చినప్పుడు భర్త ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేయాలి. భర్త ఆధార్‌కు ఎర్రర్ వస్తే భార్య ఆధార్‌తో ఎన్‌రోల్ చేయాలి. వెరిఫికేషన్‌లో అర్హులుగా గుర్తిస్తే ఇల్లు మంజూరు అవుతుంది. జిల్లాలో ఎన్ని కుటుంబాలున్నాయి, వీటిలో ఎన్ని కుటుంబాలకు సొంత ఇల్లు, స్థలం లేదని సర్వే చేస్తున్నాం.

- శైలజ, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి

రూ.10 వేల లంచానికి ఏడేళ్ల జైలు

కర్నూలు ఏసీబీ కోర్టు తీర్పు

అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లోన్ సెటిల్‌మెంట్ కోసం రూ.10వేలు లంచం తీసుకున్నందుకు ఓ అధికారికి ఏడేళ్ల జైలు, లక్ష జరిమానా పడింది. ఈ మేరకు కర్నూలు ఏసీబీ స్పెషల్ కోర్టు న్యాయాధికారి శుక్రవారం తీర్పు వెలువరించారు. కదిరి ప్రాంతం జోకుపాలెంకు చెందిన షైక్ షామీర్ బాషా అత్తకు ఏపీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ రూ.1.20 లక్షల రుణం మంజూరు చేసింది. ఆమె లోన్ మొత్తాన్ని తిరిగి చెల్లించలేకపోయింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం ఏపీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ అనంతపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బయ్యను సంప్రదించగా లంచం అడిగారు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించా రు. ఆ అధికారి బాధితుల నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు 2013 మే 3న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, కర్నూలు ఏసీబీ ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేసిన న్యాయస్థానం ముద్దాయి సుబ్బయ్యకు ఐదేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే ఆరు మాసాల సాధారణ జైలు శిక్ష విధించబడుతుందని న్యాయాధికారి పేర్కొన్నారు. అలాగే పీసీ యాక్ట్ 1988లోని సెక్షన్ 13(2), ఆర్/డబ్ల్యూ 13(1)(డి) కింద 7 ఏళ్ల జైలు, రూ.1లక్ష జరిమానా విధించారు. ఈ రెండు శిక్షలు ఒకేసారి అమల్లోకి వస్తాయని, జరిమానా మొత్తంలో నుంచి రూ.10 వేలు ఫిర్యాదుదారుడికి పరిహారంగా ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కొత్తచెరువు/అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్(నేషనల్ మెరిటి మీన్స్ స్కాలర్‌షిప్) పరీక్ష డిసెంబరు 7న నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం ప్రకటనలో తెలాపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.gov.in లోగానీ, వాట్సాప్-మనమిత్రాలోగానీ డౌన్‌లోన్ చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు-డైసి లాగిన్‌లో విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేయాలన్నారు. హాల్‌టిక్కెట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం వల్ల విద్యార్థి పరీక్షాకేంద్రాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు28(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ వెంకటేశులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 6వరకు సాధారణ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. డిసెంబరు 7నుంచి 9 వరకు రూ.50, డిసెంబరు 10 నుంచి 12 వరకు రూ.200.., 13నుంచి 15 వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని డీఈఓ, ఏసీ తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి



దాడిలో గాయపడిన ఆంజనేయులు

కళ్యాణదుర్గం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాహనానికి గొర్రెలు అడ్డుగా వచ్చాయని కాపరి ఆంజనేయులుపై విక్రం అనే వ్యక్తి దాడి చేశారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన ఆంజనేయులు, తన గొర్రెల మందను మేత కోసం శుక్రవారం సమీప గ్రామ పరిసర ప్రాంతానికి తీసుకెళ్లాడు. గొర్రెలను సాయంత్రం తిరిగి తీసుకువచ్చే క్రమంలో ప్రధాన రహదారిని దాటిస్తుండగా అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు విక్రం వాహనం వచ్చింది. వాహనానికి గొర్రెలు అడ్డుగా రావడంతో కాపరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి ఆంజనేయులుపై దాడి చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు, వాహనాన్ని అడ్డుకుని, విక్రంను నిలదీశారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశారు. గాయపడ్డ గొర్రెల కాపరి అంజనేయులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. దాడి చేసిన విక్రం మాజీ ఎమ్మెల్యే బండి హుళికుంతప్ప తనయుడు.

ప్రియురాలు మోసగించిందని

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి మోసగించిందని మడకశిర మండలం హరేసముద్రం గ్రామానికి చెందిన రాజు(24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు, తిరుపతి ఎస్వీ యూనివర్సీటిలో రాజు పీజీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. చదువుకునే రోజుల్లో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమె మోసగించిందని బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం తిరుపతి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. తన ప్రియురాలు మోసగించినందుకే బలవన్మరణానికి పాల్పడుతున్నానని సూసైడ్ నోట్ రాసిపెట్టి, శుక్రవారం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా ప్రాణాలను కోల్పోయాడు. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి రామచంద్రప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అందరితో సమంగా దివ్యాంగులు

పారా స్పోర్ట్స్‌మీట్‌లో డీఈఓ కిష్టప్ప



లాంగ్‌జంప్ చేస్తున్న దివ్యాంగ విద్యార్థి

కొత్తచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలలో అందరితో సమానంగా దివ్యాంగ విద్యార్థులు రాణిస్తున్నారని డీఈఓ క్రిష్టప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దివ్యాంగ విద్యార్థులకు పారా స్పోర్ట్స్‌మీట్‌ను శుక్రవారం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈస్పోర్ట్స్‌మీట్‌కు జిల్లా నలుమూలల నుంచి 140 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. అండర్-17, 19 విభాగాలలో 400, 100, 200 మీటర్ల పరుగు పందేలను బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ అండర్-17, 19 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను డీఈఓ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్ పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా విద్య, సాధికారతకు జ్యోతిరావ్ పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. పూలే దంపతుల విగ్రహాలకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. జ్యోతిరావ్ పూలే.. మహిళా విద్యకు ప్రాధాన్యమిచ్చారన్నారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివ శంకర్, ఏఓలు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులో దేవదాయ శాఖ ఏసీ

ఇన్‌చార్జి ఏసీగా సుధారాణి

అనంతపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) తిరుమలరెడ్డి వ్యక్తిగత పనుల నేపథ్యంలో నెలరోజులపాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లాకేంద్రంలోని పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ సుధారాణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏసీని ఉమ్మ డి జిల్లా అర్చక సమాఖ్య నాయకులు శాలువా కప్పి సత్కరించారు. అర్చకులకు రైతు భరోసా, అమ్మ ఒడి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు, నాయకులు పాల్తూరు విజయ్, శ్రీనివాసులు, కేబీసీ రాయల్, శివశంకర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

పాత ఖాతాల్లో నగదు తీసుకోండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తగిన ఆధారాలతో పాత ఖాతాల్లోని నగదును ఖాతాదారులు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. ఆర్‌బీఐ చేపట్టిన మీ డబ్బు-మీహక్కు కార్యక్రమం ద్వారా పదేళ్లుగా లావాదేవీలు లేని బ్యాంకు ఖాతాల నుంచి ప్రజలు తమ డబ్బును తిరిగి తీసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,88,083 లావాదేవీలు నిలిచిపోయిన ఖాతాలు ఉన్నాయని వాటిలో రూ.66.95కోట్లు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా ఉన్నట్లు తెలిపారు. ఈనిధులు సంబంధిత బ్యాంకు హెడ్ ఆఫీసుల నుంచి ఆర్‌బీఐకి బదిలీ అయినట్లు పేర్కొన్నారు. ఈ డబ్బును తిరిగి పొందేందుకు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్నవారు ఆధార్, పాన్, పాస్‌పోర్టు ఫొటోతో సమీప బ్యాంకు శాఖల్లో సంప్రదించాలన్నారు. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో వారసులు డెత్ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల అంగీకార పత్రంతో పాటు బ్యాంకు కోరిన ఇతర ఆధారాలను సమర్పించి, అన్‌క్లెయిమ్డ్ నగదును పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, సీపీఓ విజయకుమార్ పాల్గొన్నారు.

సుబ్బరాయసాగర్‌ను పరిశీలించిన జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

పుట్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్‌ను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొరాయించిన గేట్‌ను పరిశీలించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గేట్ మొరాయించడంతో అరకొరగా వచ్చే నీటిని చూశారు. గేట్ మరమ్మతులు చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట హెచ్చెల్సీ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

త్వరలో ఏడీసీసీబీలో ఓటీఎస్



అప్కాబ్ మహాజన సభలో పాల్గొన్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేరుకుపోయిన బకాయిల వసూళ్లు, ఎన్‌పీఏ తగ్గింపునకు త్వరలో ఏకకాల రుణచెల్లింపు (ఓటీఎస్) అమలు చేసి పరిష్కరిస్తామని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతిలో శుక్రవారం జరిగిన బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి భూమిపూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆప్కాబ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మహాజనసభలో పాల్గొన్నారు. ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలలో పేరుకుపోయిన మొండిబకాయిలు, ఎన్‌పీఏ తగ్గించేందుకు ఏకైక పరిష్కార మార్గం ఏకకాల రుణ చెల్లింపు(ఓటీఎస్)అమలు చేయడంపై ఆప్కాబ్ ఉన్నతాధికారులతో చైర్మన్ చర్చించారు. త్వరలో ఓటీఎస్ ద్వారా రుణ పరిష్కారం చేపడుతామని చైర్మన్ తెలిపారు.

సబ్‌జైలు తనిఖీ

పెనుకొండ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సబ్‌జైలును లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఖైదీల సమస్యలు విచారించి వారికి అందుతున్న సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం న్యాయసహాయం, ఉచిత లాయర్ సహాయం తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి తక్షణం ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నాగిరెడ్డి, విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.



సౌకర్యాలపై ఆరాతీస్తున్న వాసుదేవన్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య
● మర్తాడు రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

గార్లదిన్నె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య అన్నారు. మర్తాడు రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పలువురు టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గార్లదిన్నె నుంచి మర్తాడు మీదుగా కోటంకకు వెళ్లే ప్రధాన దారి పెద్ద ఎత్తు గుంతలు అధ్వాన స్థితికి చేరిందన్నారు. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారన్నారు. రోడ్డు ఎప్పు డు వేస్తారో నని అందరం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నామన్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి సహకారంతో మర్తాడు రోడ్డుకు సుమారు 600 మీటర్ల మేర నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులు మంజురయ్యాయన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే కోటంక వరకు పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గిరమ్మగారి సోమశేఖర్, క్లస్టర్ ఇంచార్జి ఆవుల శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జి వెంకటేష్, ఐటీడీపీ శ్రీధర్, ఎస్సీసెల్ కార్యదర్శి బూడిద కిష్ట, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేబుల్ దొంగలను పట్టుకున్న గ్రామస్థులు

● పోలీసులకు అప్పగింత

రామగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ కొత్తపల్లిలో కేబుల్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను గ్రామస్థులు శుక్రవారం సాయంత్రం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామ సమీపంలోని తోటలో ఇద్దరు దొంగలు కేబుల్‌ను చోరీ చేస్తుండగా రైతులు గమనించి పట్టుకునే ప్రయత్నం చేశారు. వారు రైతులపై తిరగబడి దాడి చేసేందుకు ప్రయత్నించారు. గ్రామంలో మరికొందరు రైతులు విషయం తెలిసి సంఘటనాస్థలానికి వెళ్లగా ఒక దొంగ పరారయ్యాడు. మిగిలిన ఒకడిని వారు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఏడాది నుంచి తరచూ మోటార్ల కేబుళ్ల చోరీకి గురవుతున్నాయని, ప్రస్తుతం దొంగలు దొరికారని గ్రామస్థులు తెలిపారు. వీరిపై చర్యలు తీసుకుని కేబుళ్లను రికవరీ చేయాలని పోలీసులను కోరారు.

ఎమ్మెల్యేకు ఏజీపీ సన్మానం


పరిటాల సునీతను సన్మానిస్తున్న ఏజీపీ సుబ్బారావు

రామగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సీనియర్ అండ్ జూనియర్ కోర్టులో ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా నియమితులైన సుబ్బారావు వెంకటాపురంలో శుక్రవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీతను, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అలాగే తనకు పదవి రావడానికి కృషి చేసిన పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్‌సాబ్, ప్రసాద్, బాబు, మోహన్‌ప్రసాద్ ఉన్నారు.

మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు

రామగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగాపురం గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తున్న ఇంద్రజ తనపై దాడి చేసిన వారి పట్ల శుక్రవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన విష్ణు అనే వ్యక్తి తనకు అసభ్యకర మెసేజ్‌లు పెట్టాడని, దీంతోపాటు అతడి తల్లిదండ్రులైన గొల్ల శ్రీనివాసులు, నాగమ్మ, బంధువు ఓబయ్య కలిసి తనపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేశారు.

'విద్యారంగంలో యూటీఎఫ్ పాత్ర అమోఘం'

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యారంగం, ఉపాధ్యాయుల హక్కుల సాధనలో యూటీఎఫ్ పాత్ర అమోఘమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కొనియాడారు. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో యూటీఎఫ్ ప్రత్యేకంగా ముద్రించిన టెన్త్ మోడల్ ప్రశ్నాపత్రం పుస్తకాన్ని గేయానంద్‌తోపాటు డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులు సాధించడంలో యూటీఎఫ్ ఎంతో పోరాటం సాగించిందన్నారు. ఏటా పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల ఉత్తీర్ణత కోసం మోడల్ పేపర్స్ ముద్రించి ఇవ్వ డం అభినందనీయమన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని పదిలో ఉత్తమఫలితాలుసాధించాలని అకాంక్షించారు. కార్యక్రమం లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు సుధాకర్, లింగమ య్య, జిలాన్, రమణయ్య, ప్రమీల, కోటేశ్వరప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.

టీచర్లకు టెట్ మినహాయించేలా చూడండి

● ఎంపీ బీకేకు యూటీఎఫ్ నాయకుల వినతి

అనంతపురం విద్య, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునకు కృషి చేయాలని యూటీఎఫ్ నాయకులు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథికి విన్నవించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన యూటీఎఫ్ నాయకులు ఎంపీ బీకేను అనంతపురంలోని నివాసంలో శుక్రవారం కలిసి మాట్లాడారు. ప్రతి టీచర్ టెట్ రాయాలని, అందులో ఉత్తీర్ణత కాకపోతే సర్వీస్ నుంచి తొలగిస్తామనే నిబంధన సర్వీస్ టీచర్లను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం డీఎస్సీ ఉత్తీర్ణత పొంది టీచర్ ఉద్యోగాలు సాధించారని, దశాబ్దాలుగా పాఠాలు బోధిస్తున్నారని, వారిని ఇప్పుడు టెట్ రాయాలనడం సరికాదన్నారు. ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం ఎంతో బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కేంద్రంతో మాట్లాడి ఈ టెట్ సమస్యను పరిష్కరించి సర్వీస్ టీచర్లకు ఊర ట కల్పించాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారను. యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి జయచంద్రారెడ్డి, నాయకులు సుధాకర్, నారాయణస్వామి, రామక్రిష్ణానాయక్, రవీంద్ర, నబీ, రామాంజనేయులు, వినయ్, రామక్రిష్ణ, నాగిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.


ఎంపీ బీకే పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు



జడ్పీ కార్యాలయ ఆవరణలో విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు తదితరులు

సామాజిక తత్వవేత్త జ్యోతిరావ్ పూలే

● కొనియాడిన వక్తలు
● వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

న్యూస్‌నెట్‌వర్క్(ఆంధ్రజ్యోతి): సామాజిక తత్వవేత్త, బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావ్ పూలేనని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా, కుల, మహిళా సంఘాల నాయకులు, అధికారులు తదితరులు శుక్రవారం విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ బడుగులు, బలహీన వర్గాల వారు నేడు అన్నిరంగాల్లో ముందుకెళ్తున్నారంటే పూలే వంటి మహనీయుల కృషి వల్లేనని తెలిపారు. మహిళా విద్యకోసం ఉద్యమించిన గొప్ప సంఘసంస్కర్త పూలేనని అన్నారు. బాలికల కోసం తన సహచరి సావిత్రిబాయి పూలేతో కలిసి తొలి పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జడ్పీ కార్యాలయ ఆవరణలోని విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.


జడ్పీ కార్యాలయ ఆవరణలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యాదవ సంఘం జిల్లా నాయకులు


అనంతపురం శ్రీశ్రీ నగర్‌లో పూలే చిత్రపటాన్ని చిన్నారులతో కలిసి ఊరేగిస్తున్న ఐద్వా మహిళలు


రామగిరి మండలం పేరూరులోని బాలుర గురుకుల పాఠశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కుటుంబ గొడవలను ఎమ్మెల్యేకు ఆపాదించడమేంటి?

● వైసీపీ నాయకులపై టీడీపీ నేతల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ఏ ఇంట్లో గొడవలు జరిగినా, ఎవరైనా వ్యక్తిగతంగా గొడవ పడ్డా వాటిని ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఆపాదించడమేమిటని టీడీపీ మండల నాయకులు వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆవుల ముత్యాలు, నాయకులు అక్కులప్ప, ఆంజనేయులు, మారెప్ప, మనోహర, సురేశ్, క్రాంతి, మనం అక్కులప్ప విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగాపురంలో అంగన్‌వాడీ ఆయా ఇంద్రజపై దాడి చేసి, ఆమెను రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారంటూ వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. అంగన్‌వాడీ ఆయా గొల్ల ఇంద్రజ, గొల్ల శ్రీనివాసులు కుమారుడు గొల్ల విష్ణుకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయన్నారు. ఇటీవల రెండు కుటుంబాలు గొడవపడ్డాయన్నారు. దీనిని వైసీపీ వారు మహిళపై జరిగిన దాడిగా చిత్రీకరించి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్‌కు అంటకడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కూడా ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై దారుణం జరిగితే పరిటాల వర్గీయులే అంటూ విష ప్రచారం చేశారన్నారు. పాపిరెడ్డిపల్లి సంఘటనను కూడా ఇలాగే చేశారన్నారు. స్వార్థ రాజకీయాలకు వైసీపీ వారు ఇలా దుష్ప్రచారాలు చేస్తూ పైశాచిక ఆనందం పొం దుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఇలాంటి విషప్రచారాలను ఇప్పటికైనా మానుకోవాలన్నారు. లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

మేయర్ చెబుతున్నవన్నీ అబద్ధాలే: టీడీపీ


అర్బన్ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నగరంలో వెయ్యి రూ. కోట్లతో అభివృద్ధి చేశామని మేయర్ వసీం చెబుతున్నవన్నీ అపద్ధాలేనని అర్బన్ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో నిజంగా రూ. వెయ్యికోట్లతో అభివృద్ధి చేసి ఉంటే.. నగరం ఇలా ఉండేదా...? అని ప్రశ్నించారు. అంత అభివృద్ధి చేసి ఉంటే.. మీడియా ముఖంగా వివరించాలని డిమాండ్ చేశారు. మేయర్ స్థానంలో ఉండి కూడా ఆయన తనసొంత డివిజన్‌ను అభివృద్ధి చేసుకోలేకపోయారని దుయ్యబట్టారు. నాలుగున్నరేళ్లలో ఆయన ఏనాడూ ప్రజాసమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఆయనపై అవిశ్వాసం పెడితే.. వైసీపీ కార్పొరేటర్లే దించేస్తారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేష్, టీడీపీ ఎస్సీ సెల్ అధికారప్రతినిధి వన్నూరప్ప, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్‌కుమార్, 13వ డివిజన్ ఇన్‌చార్జి కాశీవిశ్వనాథ్, ఇతర నేతలు పాల్గొన్నారు.

మేయర్ అమూల్ బేబీ: రాయల్ మధు

అభివృద్ధి అంటే ఏంటో తెలియని అమూల్ బేబీ మేయర్ వసీం అంటూ టీడీపీ నాయకుడు రాయల్ మధు విమర్శలు గుప్పించారు. ఆజాద్ నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేయర్ వసీం స్క్రిప్టులు చదువుతూ ఎమ్మెల్యే దగ్గుపాటిపై విమర్శలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఇకపై ఇలానే కొనసాగితే ఊరుకోమని హెచ్చరించారు. నాయకులు జోగి రాజేంద్ర, ఇనైతుల్లా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్నాయని, విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ బీచ్‌రోడ్డులో 5 రోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలనుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. మహాసభల చివరిరోజున జనవరి 4న మహార్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి ఉద్యోగులు, కార్మికులు, సీఐటీయూ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు, కోశాధికారి నాగమణి, ఉపాధ్యక్షులు గోపాల్, శకుంతల, కార్యదర్శులు ముత్తుజా, రమాదేవి పాల్గొన్నారు.

ఆపరేటర్ మృతి

రామగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ రఫీ(38) అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందాడు. రఫీ గురువారం రాత్రి విధులలో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కడుపు నొప్పి అధికమై రక్తవాంతులు చేసుకుని స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే తోటి ఆపరేటర్, కుటుంబసభ్యులకు తెలపడంతో అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, లైన్‌మెన్‌లు గోపాల్‌క్రిష్ణ, పరమేశ్వర, సంజీవరెడ్డి, కాంతస్వామి, తోటి ఆపరేటర్లు, సిబ్బంది వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇటుకలపల్లిలో దంత వైద్యశిబిరం

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లిలో ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో విజయా డెంటల్ ఆస్పత్రి వారు దంత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రాణి సమ్యుక్త, వైద్య సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే టూత్‌పేస్ట్, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం బాబాఫక్రుద్దీన్, అధ్యాపకులు వెంకటేశ్వరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బంజారాల అభ్యున్నతికి కృషిచేయాలి

అనంతపురం వైద్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రాంతాలకు సుదూరంగా ఉండి జీవనం సాగిస్తున్న బంజారాల (సుగాలి) అభ్యున్నతికి కృషి చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రినాయక్ శుక్రవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా 30న బంజారా సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారాలను ప్రభుత్వం ముందు పెట్టడమే లక్ష్యమన్నారు. సమావేశానికి జిల్లాలోని బంజారాలు తరలిరావాలని కోరారు.

నేడు రాజకీయ పార్టీల నాయకుల సమావేశం

శింగనమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ హబీబా కుహేనుస్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఓటర్ల జాబితా ఇతర విషయాలపై చర్చించేందుకు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరు మండలాల తహసీల్దార్లు హాజరువుతారని తెలిపారు. అన్ని పార్టీల నాయకులు పాల్గొనాలని కోరారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

ఆత్మకూరు నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. కొత్తపల్లి గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిటాలసునీత ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి శుక్రవారం ప్రకటనలో తెలిపారు గ్రామానికి రూ. 98లక్షల వ్యయంతో వేసిన తారు రోడ్డును, రూ. 25లక్షలతో వేసిన సీసీరోడ్డును , వాటర్ ప్లాంటును ప్రారంభించనున్నట్లు చెప్పారు. మండలంలోని టీడీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

వివేకానందుడి బోధనలు ఆచరణీయం

● రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్


వివేకానందుడి జీవితంపై విద్యార్థులకు వివరిస్తున్న స్వామి బోధమయానందజీ మహరాజ్

అనంతపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వివేకానందుడి బోధనలు ఆచరణీయమనీ, సమాజంలోని ప్రతి విద్యార్థి వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలని రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని హెచ్చెల్సీ కాలనీలో రామకృష్ణ విశ్వజనీన ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. శుక్రవారం రెండోరోజు జరిగిన వేడుకలో హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై యువజన సదస్సును జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వివేకానందుడి గురించి విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. నేటి యువత ప్రతివిషయంలోనూ నిర్భయంగా మనోధైర్యంతో జీవించడం అలవర్చుకోవాలన్నారు. వివేకానందుని ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన స్ఫూర్తిని భావితరాలకు పంచేందుకు కృషి చేయాలన్నారు. వివేకానందుని ప్రసంగాలతో విద్యార్థులు చైతన్యవంతులై సమాజ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అలాగే విశ్వజనీన ఆలయంలో కలశపూజలు నిర్వహించారు. రామకృష్ణ మఠం రాజమండ్రి అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, విజయ వాడ ఆశ్రమ ప్రతినిధి స్వామి శితికంఠానందజీ మహరాజ్, చెన్నై టి.నగర్ ప్రతినిధి స్వామి యదునాథానందజీ మహరాజ్, ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీధరమూర్తి, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కనీస వసతులు కల్పించండి


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరనారప్ప, వినయ్ శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాలలో కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు లేవన్నారు. దీంతో ఉద్యోగులు నానాఅవస్థలు పడుతున్నారన్నారు. మహిళా ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. వెంటనే వసతులు కల్పించాలన్నారు. అలాగే ప్రింటర్లు పనిచేయడం లేదని, స్టేషనరీ లేదని, ఏర్పాటు చేయాలని కోరారు. ఇక ఉద్యోగుల సీనియార్టీ జాబితా ప్రకటించి, అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని అన్నారు. అనంతరం ఈ వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ కమిషనర్ పావనిని కలిశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, కోశాధికారి ముత్యాలప్ప, సహాయ కార్యదర్శి జ్యోతి, కార్యవర్గసభ్యులు హరినాథ్‌రెడ్డి, శ్రీనాథ్, ప్రశాంత్, అనిల్, మృదుల తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏపీఎన్జీఓ నాయకులు కూడా కమిషనర్ బాలస్వామిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎన్జీఓ నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీధర్‌బాబు, నాయకులు రామ్‌నాథ్‌రెడ్డి, దామోదర్, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, సుధాకర్ రెడ్డి, రమణారెడ్డి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు: సర్పంచ్

అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు మంజూరు చేస్తామని మండలంలోని చిన్నంపల్లి గ్రామ సర్పంచు శశశంకర్ తెలిపారు. చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని మటన్ మార్కెట్, మల్లయ్య కాలనీల్లో శుక్రవారం ఉపాధి హామీ అధికారులు జాబ్ కార్డుల జారీపై గ్రామసభ నిర్వహించారు. ఇందులో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. ఈ కాలనీల్లో 400కుటుంబాలు నివాసం ఉన్నట్లు తెలిపారు. వారికి ఇంతవరకు జాబ్‌కార్డులు లేవన్నారు. త్వరలోనే వాటిని మంజూరు చేయడంతో పాటు ఉపాధి పనులు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చరణ్, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మంపేటలో 'రైతన్నా.. మీకోసం'


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సోమశేఖర్

గార్లదిన్నె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేట గ్రామంలో వ్యవసాయశాఖ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు కలిసి శుక్రవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రైతులకు సేంద్రియ విధానాలు, అగ్రిటెక్, శాస్త్రీయ సాగు పద్ధతుల గురించి వివరించారు. వాతావరణ హెచ్చరికలు, పంట రక్షణ సమాచారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు యాప్ రూపొందించిందని తెలిపారు. రైతులకు పంట సాగు నుంచి కోత వరకు అవసరమైన సమాచారమంతా ఈ యాప్‌లో లభిస్తుందని చెప్పారు. అనంతరం రైతన్నా మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. తర్వాత పలువురు రైతులు రాయితీతో టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయాలని అధికారులకు విన్నవించారు. వ్యవసాయ అధికారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

5న అభిమానుల ముందుకు అఖండ-2

బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు గౌస్ మొద్దీన్



అనంతపురం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5వ తేదీన నందమూరి అభిమానుల ముందుకు.. బాలయ్య నటించిన అఖండ-2 సినిమా రాబోతోందని జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మొద్దీన్ పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 5న అఖండ-2 విడుదల అవుతోందని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అభిమానులకు సూచించారు. ఆ సినిమా సరికొత్త రికార్డులు సృష్టిస్తుందని అభిమానులు భావిస్తున్నట్లు చెప్పారు. ఎప్పటిమాదిరే సినిమా రిలీజ్ రోజున బ్యానర్లు కట్టి, బాణసంచా కాలుస్తూ పండగ వాతావరణాన్ని తలపించేలా అభిమానులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

నేడు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

శింగనమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయులకు ఆకులేడు పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పీఈటీ నగేష్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో ఉపాధ్యాయులకు ఈపోటీలు శనివారం నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హా జరు కావాలని కోరారు.

క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ

రామగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్లీన్ అండ్‌గ్రీన్‌పై శుక్రవారం గ్రీన్‌అంబాసిడర్లకు శిక్షణ నిర్వహించారు. ఇందులో గ్రామాలలో పరిశుభ్రత చర్యలు ఎలా చేపట్టాలి, పచ్చదనాన్ని ఎలా పెంపొందించాలనే దానిపై అధికారులు అవగాహన కల్పించారు. అలాగే చెత్తతోసంపద తయారీని ఏవిధంగా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, డిప్యూటీ ఎంపీడీఓ ప్రవీణ్‌బాబు, రీసోర్స్‌పర్సన్లు రామోజీ, సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, క్లాప్‌మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు

● శింగనమల సీఐ కౌలుట్లయ్య


సదస్సులో మాట్లాడుతున్న సీఐ కౌలుట్లయ్య

గార్లదిన్నె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సరైన దిశానిర్దేశాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని శింగనమల సీఐ కౌలుట్లయ్య సూచించారు. మండలంలోని కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ఆయన ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషాతో కలిసి విద్యార్థులకు చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. డ్రగ్స్, గంజాయి తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడితే మానసికంగా, శారీరకంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతారన్నారు. అలాగే చదువులో వెనుకబడతారన్నారు. జీవితం ఎటూ కాకుండా పోతుందన్నారు. ప్రస్తుతం చాలామంది యువత వాటికి బానిస అయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కనుక ఎవరూ వాటి జోలికి వెళ్లకుండా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గురుదత్త జయంతి మహోత్సవాలు ప్రారంభం


పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీధరఘట్టలోని శ్రీగురు దత్త ఆశ్రమంలో వారం పాటు నిర్వహించే గురుదత్త జయంతి మహోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఉదయం పుణ్యాహ, పంచగవ్య. కౌతక బంధన, వృత్తికవర్ణ , అంకురార్పణ, కళస స్థాపన యాగశాల ప్రవేశ, గణపతి హోమం, దుర్గ, లలిత హోమాలు నిర్వహించారు. రాత్రి పల్లకి సేవా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

మాక్ అసెంబ్లీ విద్యార్థికి సన్మానం


స్వప్న, టీచర్ నాగలక్ష్మమ్మను సన్మానిస్తున్న ఎంఈఓ

గుత్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న గుత్తిఆర్ఎస్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి స్వప్నను ఆ పాఠశాలలో మేళ తాళాల మధ్య శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్వప్నను ప్రోత్సహించిన సోషియల్ ఉపాధ్యాయురాలు నాగలక్ష్మమ్మనూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వప్న తండ్రి రాజేష్ , ఎంఈఓ రవినాయక్, హెచ్ఎం రామాంజినమ్మ వివిధ పాఠశాలల హెచ్ఎంలు దేశాయ్ నాగరాజు, రంగనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల అందజేత


స్పోర్ట్స్ కిట్లతో క్రీడాకారులు

పెద్దవడుగూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భరత్, లావణ్య, కార్తీక్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విషయం తెల్సిందే. దీంతో వారిని శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. టీడీపీ జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి వారికి స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.

మళ్లీ టీడీపీ గూటికి..


టీడీపీలో చేరిన వన్నూరుస్వామి

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడకు చెందిన టీడీపీ కార్యకర్త వన్నూరుస్వామి తిరిగి టీడీపీలో చేరారు. స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడితో ఆయన మెట్టు విశ్వనాథ్‌రెడ్డి సమక్షంలో ఈ నెల 25న వైసీపీలో చేరారు. ఆ పార్టీలో చేరిన మూడురోజులకే తిరిగి శుక్రవారం టీడీపీ గూటికి చేరాడు. బొమ్మనహాళ్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి తిమ్మరాజు సమక్షంలో ఆయన టీడీపీ కండువ వేసుకున్నారు. వన్నూరుస్వామి మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు తనను బలవంతంగా తీసుకెళ్లి ఆ పార్టీ కండువ వేసారని వాపోయారు. వైసీపీ చిల్లర రాజకీయలు చేస్తోందని కొత్తపల్లి తిమ్మరాజు, సోమనాథ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకన్న, రాతింటి వన్నూరుస్వామి, ఎస్‌జి వన్నూరుస్వామి పాల్గొన్నారు.

అరటి తోటల పరిశీలన


గంగవరంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

బెళుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో ఉద్యానశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనుంజయ, శాఖాధికారి కృష్ణతేజ అరటి తోటలను శుక్రవారం పరిశీలించారు. పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి కాయలు నాణ్యతగా ఉండేందుకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఓటర్ల మ్యాపింగ్ సర్వేపై సమీక్ష

గుంతకల్లుటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓటర్ల మ్యాపింగ్ సర్వేపై ఆర్డీఓ శ్రీనివాస్ స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్వోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. త్వరలో ఎస్ఐఆర్ సర్వే చేపడతామని, ఒక పోలింగ్ బూత్‌కు 1200 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలింగ్ లెవల్ అసిస్టెంట్లను నియమించుకోవాలని సూచించారు. ఇందులో గుంతకల్లు, గుత్తి, పామిడి తహసీల్దార్లు రమాదేవి, పుణ్యవతి, రామకృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు భార్గవ్ రామ్



బెళుగుప్ప, నవంబరు28(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీలో ఈ నెల 19న నిర్వహించిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీలో స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి భార్గవ్ రామ్ ప్రతిభచాటాడు. ఈనెల 29 నుంచి డిసెంబరు ఒకటో తేది వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పీడీ గోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

వైద్యం షెడ్‌కు..!

- రాయలచెరువులో అందని వైద్యం
- ఆగిన ఆస్పత్రి భవన నిర్మాణం
- రేకులషెడ్‌లో పదేళ్లుగా నిర్వహణ
- సౌకర్యాలు లేక రోగుల పాట్లు



రేకులషెడ్డులో నిర్వహిస్తున్న రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, నిలిచిపోయిన భవన నిర్మాణం

యాడికి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని దాదాపు 25 సంవత్సరాల క్రితం నిర్మించారు. దీంతో అది శిథిలావస్థకు చేరుకుంది. పై కప్పు పూర్తిగా దెబ్బతిని.. పెచ్చులు ఊడిపడుతుండటంతో పదేళ్ల క్రితం ఆ కప్పును పూర్తిగా తొలగించి.. రేకులు వేశారు. నాటి నుంచి ఆ రేకుల షెడ్‌లోనే ఈ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోకి రాయలచెరువు, కూర్మాజీపేట, రామరాజుపల్లి, తూట్రాళ్లపల్లి, కొత్తపల్లి, పచ్చారుమేకలపల్లి, నగరూరు, చందన, కేశవరాయునిపేట, లక్షుంపల్లి, దైవాలమడుగు తదితర గ్రామాలు వస్తాయి. ఈ గ్రామస్థులు వివిధ వైద్యసేవల కోసం రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు. అయితే రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న ఈ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలూ లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు నాలుగేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.96 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అయితే నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో ఆ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రస్తుతం రేకులషెడ్డులోనే ఆ వైద్యశాలను నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి.. ఆ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేకుల షెడ్డులోనే చికిత్స



రోగులకు రేకులషెడ్డులోనే వైద్య సేవలు అందిస్తున్నాం. సౌకర్యాలు లేక మెరుగైన వైద్యసేవలు అందించలేకపోతున్నాం. ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయితే మంచి వైద్య సేవలు అందించవచ్చు.

-దేవరాజన్, రాయలచెరువు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్యుడు

వ్యవసాయానికి పూర్వవైభవం

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో లోపాలను సవరిస్తాం: విప్ కాలవ


మహిళలతో మాట్లాడుతున్న విప్ కాలవ

రాయదుర్గంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమి పాలనలో వ్యవసాయరంగానికి పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే, విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని టీ వీరాపురంలో శుక్రవారం ఆయన రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. రైతు కుటుంబాలతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుబ హనుమంతు, సర్పంచులు వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు కాటా వెంకటేశులు, రామస్వామి, గంగాధర్‌శెట్టి, గంగప్ప, సుంకప్ప, సోమశేఖర్, వీరస్వామి, ప్రసాద్, లచ్చన్నచౌదరి, మాజీ జడ్పీటీసీ కుమార్ పాల్గొన్నారు.

● ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

రాయదుర్గం : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విప్ కాలవ ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. పలు ఫిర్యాదులు స్వీకరించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో వైసీపీ పాలనలో జరిగిన తప్పుల సవరణకు అనుమతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కోరతామని తెలిపారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పుగా చేయడం వల్ల అనేక మంది అర్హులకు పథకాలు అందడం లేదన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న పరమేశ్వర్ నాయక్

గుంతకల్లుటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఏసీసీ పరిశీలకుడు పరమేశ్వర్ నాయక్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంపిక కోసం కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో, ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ పూర్వవైభవానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు మహమ్మద్ అలీఖాన్, నియోజకవర్గ సమన్వయకర్త దౌల్తాపురం ప్రభాకర్, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, పట్టణ అధ్యక్షుడు తగరం రామాంజనేయులు పాల్గొన్నారు.

చెరువు గోడ కూలినా నీరిస్తాం

కణేకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కణేకల్లు శ్రీచిక్కణ్ణేశ్వర ఒడియార్ చెరువు వద్ద ఔట్‌ఫాల్ రెగ్యులేటర్‌కు అనుబంధంగా ఉన్న గోడ కూలినప్పటికీ ఏ మాత్రం ఆటంకం లేకుండా పొలాలకు నీటిని అందిస్తామని ఆ చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి తెలిపారు. రెండురోజుల క్రితం చెరువు వద్ద కూలిన గోడను వారు శుక్రవారం పరిశీలించారు. వారివెంట టీడీపీ నాయకుడు గోపాల్ ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీ

గుంతకల్లుటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రైవేట్ స్కూల్ బస్సులను ఎంవీఐ రాజాబాబు శుక్రవారం తనిఖీ చేశారు. చైతన్య స్కూల్ బస్సులకు ఎమర్జెన్సీ డోర్లు సరిగా లేవని గుర్తించారు. అనంతరం కొన్ని బస్సులకు జరిమానా విధించారు.

లయన్స్‌క్లబ్ కేబినేట్ సభ్యుడిగా బాలచంద్ర



ఉరవకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ క్యాబినేట్ సభ్యుడిగా ఉరవకొండకు చెందిన కొమ్మసాని బాలచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా గవర్నర్ ఇల్లూరు గోపాల కృష్ణ నియామక ఉత్తర్వులు పంపినట్లు ఆయన తెలిపారు.


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

రోడ్డు, ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కుందుర్పి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కుందుర్పి నుంచి జంబగుంపల, కొలిమిపాళ్యం వరకు నాబార్డు ద్వారా రూ. రెండు కోట్లతో నిర్మించిన ఆరు కిలోమీటర్ల తారు రోడ్డును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాట మేరకు ఒక్క నెలలోనే ఈ రోడ్డు వేయించామన్నారు. అలాగే మండలం మలయనూరులో రూ. ఐదు లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటును వీరు ప్రారంభించారు.

● ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం: మండలంలోని బోరంపల్లి వద్ద వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మానిరేవు గ్రామానికి చెందిన సల్లప్ప, బోరంపల్లి గ్రామానికి చెందిన సురేష్ మరణించారు. సల్లప్ప భార్య అనితమ్మకు, సురేష్ భార్య అరుణమ్మకు రూ.25 వేలు చొప్పున ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు.

● పూలేకు నివాళి: మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక ప్రజావేదికలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నీటి, చెత్త సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ కృపాకర్

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తిష్టవేసిన తాగునీటి, చెత్త సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిలరు కే కృపాకర్ మాట్లాడుతూ..ఉన్న నిధులన్నీ ధర్మవరం గేటు నిర్మాణం కోసం కాంట్రిబ్యూషన్, పరిహారాలు, పైప్‌లైన్ షిఫ్టింగ్‌కే వెచ్చిస్తే వార్డుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కౌన్సిలరు పవన్‌కుమార్‌గౌడు మాట్లాడుతూ.. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో తగినన్ని నీటి నిల్వలున్నా, పట్టణంలో కొన్ని వార్డుల్లో వారానికి ఓసారి, మరికొన్ని చోట్ల పది రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారన్నారు. వైస్ చైర్‌పర్సన్ నైరుతి మాట్లాడుతూ.. ఆర్‌యూబీ కోసం స్థలాల పరిహారాల కోసం రైల్వే ఇచ్చిన రూ.2.5 కోట్లను ఏంచేశారని ప్రశ్నించారు. ఇందులో వైస్‌చైర్‌పర్సన్ ఫైమున్, మున్సిపల్ కమిషనర్ నయ్యూం అహ్మద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు అవగాహన సదస్సు

శెట్టూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆర్ఎంపీలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నిఖిత శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి చికిత్సలు అందించాలనే అంశంపై వివరించారు.కాగా మొత్తం 36 మంది ఆర్ఎంపీ వైద్యులు ఉండగా సమావేశానికి 26 మందే హాజరయ్యారని, అందులో 13 మందికి మాత్రమే వైద్యులని ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని తెలిపారు.

ఇన్‌ఫ్లో 2,590 క్యూసెక్కులు

బెళుగుప్ప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,590, ఔట్‌ఫ్లో 2,590 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజరాయర్‌లో 1.718 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,896 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

1న వాహనాల వేలం

రాయదుర్గం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను సోమవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించే ఈ వేలంలో రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి ఆసక్తి గల వారు పాల్గొనాలన్నారు.

ప్రమాదకరంగా గేటు

కుందుర్పి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గేటు ఒకటి పూర్తిగా ఊడిపోయింది. మరొకటి ఇలా కూలడానికి సిద్ధంగా ఉంది. రోజూ పిల్లలు ఆ గేటు ద్వారాలో అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చి వెళ్తుంటారు. ఆ గేటు కూలి.. ప్రమాదం జరగకముందే దాన్ని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కూలడానికి సిద్ధంగా ఉన్న ఇనుప గేటు

పాఠశాలకు వంట సామగ్రి వితరణ

కణేకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కణేకల్లు క్రాసింగ్‌లోని గురుకుల పాఠశాలకు రూ.38 వేలు విలువైన వంట సామగ్రిని పూర్వవిద్యార్థులు అందించారు. పూర్వవిద్యార్థి హనుమంతు ఈ డబ్బులు వసూలు చేసి పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనాయుడు, సుందరరావు, విజయభాస్కర్, గంగాధర పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దపప్పూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామసమీపం అటవీప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడిపత్రిలోని బిందెలకాలనీ వాసి కృష్ణారెడ్డి (40) మరణించాడు. అతను బైక్‌లో అనంతపురం వెళ్తూ.. ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని ఏఎస్ఐ అమనుల తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రాయదుర్గం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విలాసాలకు అలవాటుపడి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తూ విక్రయిస్తున్న బొమ్మనహాళ్‌కు చెందిన నాగరాజును శాంతినగర్‌లో ఉన్న శ్మశానవాటిక వద్ద శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. అతను నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు బళ్లారి ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. అతని నుంచి రూ. 3.50 లక్షల విలువ చేసే ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

రైతు ఇంట్లో చోరీ

విడపనకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా ఉన్న సుబ్బలక్ష్మి కాలనీలోని ఓ ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. మల్లికార్జున అలియాస్ ఏసూప్రబూ తన కుంటుంబంతో కలిసి ఉరవకొండ మండలంలో కౌలుకు తీసుకున్న పంటలో కలుపు తీయడానికి గురువారం వెళ్లారు. గత ఏడాది మిరప పంటను రెండు రోజుల క్రితం విక్రయించగా వచ్చిన రూ. 2.80 లక్షలను ఇంట్లోని బీరువాల్లో ఉంచి వెళ్లారు. గురువారం దుండగులు ఆ బీరువాలోని రూ. 2.80 లక్షల్లో రూ. లక్ష మాత్రమే తీసుకుని వెళ్లారు. పొలం నుంచి శుక్రవారం వచ్చిన మల్లికార్జున చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● మూడేళ్ల క్రితం ఇదే ఇంట్లో చోరీ: మూడేళ్ల క్రితం మల్లికార్జున ఇంట్లో చోరీ జరిగింది. రూ.60 వేలు దోచుకెళ్లారు. అనుమానం ఉన్న వ్యక్తుల పేర్లను తెలిపినా.. వైసీపీ అధికారంలో ఉండటంతో అప్పట్లో విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేయకుండా రూ. 5 వేలు రికవరి చేసి చేతులు దులుపుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడప రహదారికి చర్చీ స్కూల్ సమీపంలో ముళ్లపొదల్లో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. వారివద్ద నుంచి రూ.18,600 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మట్కా బీటర్లు..

ఉరవకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరులో సచివాలయం సమీపంలో మట్కా రాస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ మహానంది శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 27,450 నగదును, చిట్టీలను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని అన్నారు.

దుకాణదారుడికి రూ.50 వేల జరిమానా

బొమ్మనహాళ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఓ దుకాణంలో అనంతపురం తూనికల కొలతల ఇన్స్పెక్టర్ శంకర్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఆ దుకాణంలో విక్రయించే కురుకురే, చాక్లెట్లు తదితర ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీ లేని విషయాన్ని గుర్తించారు. అంతేకాకుండా ఆ దుకాణానికి లైసెన్స్ కూడా లేకపోవడంతో రూ.50వేల జరిమానా విధించారు.


జరిమానా విధిస్తున్న అధికారి శంకర్

టీడీపీ కార్యకర్తకు నివాళి

బ్రహ్మసముద్రం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మగాని పల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బెంగళూరు శంకర్ నాయక్ అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ, పార్టీ మండల అధ్యక్షుడు పాలబండ్ల శ్రీరాములు, గ్రామ కన్వీనర్ మధు, డీలర్, నాగభూషణ, పరిటాల శ్రీనివాసులు, మధు డీలర్ నాగభూషణ, పరిటాల శ్రీనివాసులు, స్కూలు కమిటీ చైర్మన్ బోయ శ్రీనివాసు లు, ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి, రవీందర్ నాయక్ నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న ధర్మతేజ

రైతుల గోడు పట్టించుకోండి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీశ్

గుంతకల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధరలేక అవస్థపడుతున్న రైతుల గోడును పట్టించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అరటి, బత్తాయి, దానిమ్మ, పత్తి, కంది, శనగ, మొక్కజొన్న పంటలకు ధర ల్లేక రైతులు అమ్ముకోలేకపోతున్నారన్నారు. అధికవర్షాలు, వర్షాభావాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పంట పరిహారాలు, బీమా క్లెయింలు ఇవ్వడం లేదన్నారు. త్వరలో రైతుల సమస్యపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రామాంజనేయులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల పంపిణీ

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో బోరు బావుల కింద వేరుశనగను సాగు చేసుకునే రైతులకు 40 శాతం రాయితీతో విత్తనాన్ని పంపిణీ చేస్తున్నట్లు వజ్రకరూరు ఏవో మధుకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్వింటాకు 5,520 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జ్యోతిరావ్ పూలేకు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటాల వద్ద ప్రముఖులు శుక్రవారం నివాళులర్పించారు. రాయదుర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జ్యోతిరావ్ పూలే సేవలను కొనియాడారు. తాడిపత్రిలో కూరగాయల మార్కెట్ వద్ద సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ ఆధ్వర్యంలో , ఉరవకొండ సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి ఆధ్వర్యంలో, గుంతకల్లు శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో, గుత్తిఆర్ఎస్ పత్తికొండ రోడ్డులో రాజకీయ పార్టీలు, కుల సంఘాల నాయకులు, పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు.